నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, శనివారం 25 మే 2024 | MEDAK


## భూంపల్లి ఎస్సై సస్పెన్షన్

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి) మే 24: చోరీ కేసులో అవకతవకలకు పాల్పడటంతో పాటు భూతగాదా విషయాల్లో బాధితులను కాకుండా ప్రత్యర్థులకు సహకారం అందించిన సిద్దిపేట జిల్లా భూంపల్లి ఎస్సై రవికాంత్‌ను సస్పెన్షన్ చేస్తూ మల్టీ జోన్1 ఐజీ ఏవీ రంగనాథ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్లితే మెదక్ జిల్లా శివంపేట ఎస్సైగా రవికాంత్ విధులు నిర్వహించే సమయంలో సిగ్గిల్లాపూర్‌లోని మామిడితోటలో 50 టన్నుల పైగా పండ్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు తోట యజమాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తక్షణమే కేసు నమోదు చేయకుండా ఎస్సై నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై కొద్ది రోజుల అనంతరం ఈ కేసు సివిల్ కేసు పరిధిలోకి వస్తుందని పోలీసు అధికారులను తప్పుదోవ పట్టించాడు. దొంగతనం కేసును సివిల్ కేసును ముగించేందుకు ఎస్సై అవకతవకలకు పాల్పడడంతో పాటు భూతగాదాల కేసుల్లో బాధితులకు కాకుండా ప్రత్యర్థులకు సహకారం అందిస్తూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. కేసుల విషయంలో ఎస్సై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో మెదక్ జిల్లా ఎస్పీ చేసిన విచారణ నివేదికల ఆధారంగా నిజనిర్ధారణ అయ్యింది. భూంపల్లి ఎస్సై వి.రవికాంత్‌ను విధుల నుంచి సస్పెన్షన్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ షురూ..

సంగారెడ్డి కలెక్టరేట్, మే 24: జిల్లాలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంత వాతావరణం లో ప్రారంభమయ్యాయి. ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో మొత్తం 31 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షకు సంబంధించి తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్షలు నిర్వహించగా, మొత్తం 2,936 మంది విద్యార్థులకు 2,722 మంది విద్యార్థులు హాజరయ్యారు. 214 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ కేటగిరీలో మొత్తం 2,676 మందికి 2,496 మంది విద్యార్థులు హాజరయ్యారు. 180 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీకి సంబంధించి మొత్తం 260 మందికి 226మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 34మంది పరీక్షకు డుమ్మా కొట్టారు. మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సంబంధించి తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్షలు నిర్వహించగా, మొత్తం 849 మందికి 789 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో జనరల్ కేటగిరీలో మొత్తం 771 మందికి 721మంది విద్యార్థులు హాజరయ్యారు. 50 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీకి సంబంధించి మొత్తం 78 మందికి 68 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 10 మంది పరీక్షకు డుమ్మా కొట్టారు.

# మేలైన విత్తనాలతో అధిక దిగుబడులు

### తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి శ్రీదేవి

- విత్తన మేళాకు తరలివచ్చిన రైతులు



సిద్దిపేట జిల్లా తోర్నాలలో నాణ్యమైన కంది విత్తన బస్తాను కొనుగోలు చేస్తున్న రైతు

సిద్దిపేట రూరల్, మే 24: మేలైన విత్తనాలతో రైతులు అధిక దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుందని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి శ్రీదేవి అన్నారు. సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలంలోని తోర్నాల వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం విత్తన మేళా నిర్వహించారు. శాస్త్రవేత్తలతో చర్చాగోష్టి జరిగింది. వివిధ పంటల్లో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాన శాస్త్రవేత్త, కళాశాల అధిపతి శ్రీదేవి మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నాణ్యమైన విత్తనాల ప్రాముఖ్యత, దిగబడులపై రైతులకు వివరించారు. తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం తయారు చేసిన మేలైన విత్తనాల ప్రదర్శన రైతులను ఆకట్టుకుంది. వరి విత్తనాలు దొడ్డు రకం జేజీఎల్-24423 (జగిత్యాల వరి-1), కేఎన్ఎం-118 (కునారం సన్నా లు), సన్న రకాలు కేఎన్ఎం1638(కునారం వరి-2), డబ్ల్యూజీఎల్-44(సిద్ది), డబ్ల్యూజిల్-962 (వరంగల్ వరి-2), కందిలో డబ్ల్యూఆర్ జీఈ-97(వరంగల్ కంది-1), డబ్ల్యూఆర్ జీఈ-93 (తెలంగాణ కంది-1), డబ్ల్యూఆర్ జీఈ-255 (వరంగల్ కంది-2) నాణ్యమైన విత్తనాల గురించి రైతులు ఆసక్తిగా తెలుసుకున్నారు. విత్తనాలు వాడేటప్పుడు నేల పరీక్షలు చేయించుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. వ్యవసాయ శాఖ సిద్దిపేట జిల్లా అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట ఎరువులు వాడాలని, విత్తనం లభించకుంటే పెసర కూడా సాగు చేసుకోవచ్చని తెలిపారు. బీజేఆర్ అగ్రికల్చర్ సిరిసిల్ల కళాశాల అసోసియేట్ డీన్ జి.శ్రీదేవి మాట్లాడుతూ రైతులు వివిధ పంటల్లో వాడుతున్న పురుగుమందులతో మానవ, పర్యావరణ వ్యవస్థపై ప్రభావాన్ని వివరించారు. మోతాదుకు మించి పురుగు మందులు వాడకంతో పర్యావరణంతోపాటు నేల కలుషితం అవుతుందన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ విజయ్ మాట్లాడుతూ వేసవి లోతు, దుక్కులు చేసుకోవాలని తద్వారా వరిలో మోగిపురుగు నివారణ సాధ్యమన్నారు. విత్తన మేళాలో ఆదర్శ రైతులు రాజిరెడ్డి(వెదసాగు), రవీందర్(డ్రంసీడర్), కవిత(అధిక సాంద్రత పత్తి తర్వాత పంట మొదల్లను దున్ని పొద్దు తిరుగుడు సాగు చేయడం) అనే అంశాల్లో ప్రతిభచూపిన వీరిని శాస్త్రవేత్తలు సన్మానించారు. నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నట్లు శాస్త్రవేత్త శ్రీదేవి తెలిపారు. మేళాలో తోర్నాల వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు ఉమారాణి, సరిత, శ్వేత, శ్రీజయ, రమాదేవి, పల్లవి, రాజా, తోర్నాల, బుస్సాపూర్, ఘనపూర్, ముండ్రాయి, పోతారం, చిట్టాపూర్, ఇబ్రహీంపూర్, చేర్యాల నుంచి 300మంది రైతులు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ పరిశోధన స్థానం విద్యార్థులు పాల్గొన్నారు.



విత్తన మేళాకు హాజరైన వివిధ ప్రాంతాల రైతులు

# ధాన్యం సేకరణపై కదిలిన యంత్రాంగం

- కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన సంగారెడ్డి కలెక్టర్, ప్రత్యేకాధికారి భారతిహోళికేరి
- ధాన్యం సేకరణ త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశం
- రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు



సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం కోడూరులోని రైసుమిల్లును సందర్శించి నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి, మే 24(నమస్తే తెలంగాణ): 'ఎక్కడి ధాన్యం అక్కడే' శీర్షికతో నమస్తే తెలంగాణలో శుక్రవారం ప్రచురితమైన కథనం అధికార యంత్రాంగంలో కదలికను తీసుకొచ్చింది. 'నమస్తే కథనం'పై స్పందించి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళికేరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళికేరి జిన్నారం, గుమ్మదిదలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం సేకరణ తీరును పరిశీలించి ధాన్యం సేకరణ మరింత వేగంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ మాధురి, సివిల్ సప్లయ్ అధికారులకు సూచించారు. సంగారెడ్డి మండలంలోని దాసుగడ్డ తండా కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్, భారతి హోళికేరి సందర్శించారు. ధాన్యం అమ్మేందుకు వచ్చిన రైతులతో మాట్లాడారు. ధాన్యం అమ్మకంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? తరుగు పేరుతో అదనంగా ధాన్యం తీసుకుంటున్నారా? అంటూ అడిగారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం సేకరించాలని, సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు చేర్చాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కొడూరులోని రైస్‌మిల్లును కలెక్టర్, భారతి హోళికేరి సందర్శించారు. మిల్లుకు వచ్చిన వాహనాలను వెంటవెంటనే ఖాళీ చేయించి కొనుగోలు కేంద్రాలకు పంపించాలని మిల్లు యాజమాన్యానికి సూచించారు. సాధ్యమైనంత త్వరగా ధాన్యం బస్తాలను దించుకోవాలని ఆదేశించారు. మిల్లులో సార్టెక్స్ మిషన్ పెట్టుకోవాలన్నారు. పుల్కల్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించారు. అక్కడ రైతులతో మాట్లాడారు. అనంతరం రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం సేకరణలో జాప్యం జరగవద్దని, వాహనాలు, కూలీల కొరత లేకుండా చూడాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. పౌర సరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను మిల్లులకు చేర్చే పనులను వేగవంతం చేశారు. ఇందు కోసం అవసరమైన వాహనాలను సమకూర్చారు. మరో ఎనిమిది రైసు మిల్లుల యజమానులను ధాన్యం బస్తాలను దించుకునేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు ఒప్పించారు.

## బస్తాలను మిల్లులకు తరలించాలి

- ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతి హో ళికేరి



జిన్నారం: కొనుగోలు కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న భారతి హోళికేరి

జిన్నారం, మే 24: కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీల్లో మిల్లులకు తరలించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళికేరి సిబ్బందికి సూచించారు. శుక్రవారం జిన్నారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంగారెడ్డి జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ మాధురితో కలిసి పరిశీలించారు. జిన్నారం శివారులోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బందితో మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రం వద్ద నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు లారీల్లో రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. రవాణాలో జాప్యం లేకుండా చూడాలన్నారు. జియో ట్యాగింగ్‌ను పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే ప్రతి గింజనూ కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో వనజాత, తహసీల్దార్ భిక్షపతి, వ్యవసాయాధికారి రవీంద్రనాథ్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం నరేందర్, వీవో సుజాత, ఏఈవోలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



బ్రాహ్మణపల్లిలోని కొనుగోలు కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న మైసయ్య యాదవ్

## ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలి

నర్సాపూర్, మే 24: కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని తక్షణమే రైస్‌మిల్లులకు తరలించాలని రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మైసయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. బ్రాహ్మణపల్లి కొనుగోలు కేంద్రంలో రెండు లారీల ధాన్యం నిల్వ ఉన్నదని, తక్షణమే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారన్నారు. గత కొద్ది రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డా వడ్లు మొలకెత్తి తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం తరలించకపోతే డీపీఎంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

# కొనుగోళ్లు ముమ్మరం చేయాలి

- ధాన్యం చివరి గింజ వరకూ కొంటాం
- రైతులు అధైర్యపడొద్దు
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



వడియారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చేగుంట, మే 24: ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేయాలని, కొనుగోళ్లు పూర్తయ్యే వరకు ప్రతి సెంటర్ పనిచేస్తుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. చేగుంట మండలంలోని వడియారంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వడియారం కేంద్రంలో కొనుగోళ్లు త్వరగా పూర్తి చేసి రైస్ మిల్లుకు తరలించాలని ఆదేశించారు. జిల్లాలో 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 2,35,222,040 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 54,246 మంది రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.38243 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. 148 కేంద్రాల్లో ధాన్యం పూర్తయిందని, మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరగా కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. మెదక్ జిల్లాలోని 34 బాయిల్డ్, 31రా మిల్లులకు ధాన్యం కేటాయించామన్నారు. కొనుగోళ్లు వేగవంతం కోసం సిద్దిపేట జిల్లాకు పదివేల మెట్రిక్ టన్నులు, మహబూబ్‌నగర్ జిల్లాకు 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పంపించామని చెప్పారు. మరో 10వేల మెట్రిక్ టన్నులకు ఆర్డర్ వచ్చిందన్నారు. ఆరు వందలకుపైగా లారీలు అందుబాటులో ఉన్నాయని, వీటితో పాటు ఇతర జిల్లాల నుంచి 150 లారీలను తెప్పించామని కలెక్టర్ చెప్పారు. పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ గియానిస్సా బేగం, ఎంపీడీవో చెన్నారెడ్డి తదితర అధికారులు ఉన్నారు.

# పోలీస్‌స్టేషన్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం



సంగారెడ్డిలో చికిత్స పొందుతున్న ఖీరురాథోడ్

కోహీర్, మే 24: భూవివాదంలో పోలీసులు వేధిస్తున్నారని రైతు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల కథనం ప్రకారం.. మొగుడంపల్లి మండలంలోని సజ్జారావుపేట తండాకు చెందిన అన్నదమ్ములు ఖీరురాథోడ్, చందర్ మధ్య భూమి విషయంలో కొంతకాలంగా తగాదా సాగుతున్నది. ధరణిలో ఖీరు పేరున సర్వే నంబర్ 139లో ఉండాల్సిన ఏడు ఎకరాలు కనిపించడం లేదు. మరో సర్వే నంబర్ 140లో కూడా తనకు 10గుంటల భూమి వస్తుందని అతడి అన్న చందర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ధరణిలో నుంచి ఏడు ఎకరాల భూమి మాయంకావడం, అన్న కేసు పెట్టడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. దీంతో శుక్రవారం సాయంత్రం ఖీరూరాథోడ్ కుటుంబ సభ్యులతో కలిసి జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. భూమి విషయంలో పోలీసులతో మాట్లాడాడు. కానీ పోలీసులు తనను వేధిస్తున్నారని పోలీస్ స్టేషన్ ఎదుట పురుగుల మందు తాగాడు. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు చికిత్స కోసం సంగారెడ్డి జిల్లా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నాడు. అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. భూ వివాదాలను కోర్టులో పరిష్కరించుకోవాలని పోలీసులు వారికి నచ్చజెప్పారు.

# అసంపూర్తిగా ఎఫ్‌ఎస్‌టీపీ పనులు

- మానవ వ్యర్థాలతో ఎరువు తయారీ పనులకు బ్రేక్
- బిల్లులు రాక ముందుకు సాగని పనులు
- మంత్రి పొన్నం దృష్టి సారించాలి

హుస్నాబాద్ టౌన్: హుస్నాబాద్‌లో నిలిచిపోయిన ఎఫ్‌ఎస్‌టీపీ పనులు



హుస్నాబాద్ టౌన్, మే 24: అందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో పర్యావరణానికి మేలు చేసేందుకు మానవ మల వ్యర్థాలతో ఎరువు తయారీ కేంద్రానికి కేసీఆర్ ప్రభుత్వం హుస్నాబాద్‌లో శ్రీకారం చుట్టింది. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు అనారోగ్యాన్ని దరి చేరకుండా మానవ మలంతో ఎరువులు తయారీ చేసే ప్లాంట్ హుస్నాబాద్ మున్సిపాలిటికీ మంజూరు చేసింది. బహిరంగ ప్రదేశాల్లో మానవ మలాన్ని పడేటయంతో ఎదురవుతున్న సమస్యలను దూరం చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకొని పనులు ప్రారంభించింది. కానీ బిల్లులు అందక పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి.

**ఎఫ్ఎస్‌టీపీ నిర్మాణం..**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ శివారులో ఎఫ్ఎస్‌టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను నిర్మించేందుకు టీయూఎఫ్ఐడీసీ కింద రూ.కోటిని బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులోభాగంగా స్థానిక ఎల్లమ్మచెరువు సమీపంలో ఎకరా స్థలంలో ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. ప్లాంట్‌లో ప్రహరీ, ఆపరేటర్ గది, శిక్షణ గది, అనరబిక్ స్టెబిలైజేషన్ రియాక్టర్, స్లడ్జ్ డ్రైయింగ్ బెడ్స్, బ్యాలెన్సింగ్ ట్యాంకు, అనరబిక్ బ్యాఫిల్ రియాక్టర్‌తో పాటు పలు నిర్మాణ పనులు చేపట్టారు. పట్టణంలో రోజువారీగా సేకరించిన పదివేల లీటర్ల మానవ వ్యర్థాలను వివిధ పద్ధతుల్లో శుద్ధిచేసి ఎరువును వ్యవసాయానికి ఉపయోగించడంతోపాటు మొక్కల పెంపకానికి సైతం వినియోగించేందుకు ఇది ఉపయోగపడుతుంది.

**అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు...**

హుస్నాబాద్ పట్టణానికి మంజూరు చేసిన ఎఫ్ఎస్‌టీపీ పనులు కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. దాదాపు ఆరవై శాతం పనులు పూర్తి చేసి వదిలివేశారు. ఎఫ్ఎస్‌టీపీలో వేబ్రిడ్జితో పాటు మూడు మోటర్లు బిగించడంతో పాటు అంతర్గతంగా సీసీరోడ్డు సైతం నిర్మించాల్సి ఉంది. కానీ బిల్లులు రావడం లేదని నిర్వహణ సంస్థ పనులు చేపట్టడం లేదు. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వల్ల ఎఫ్ఎస్‌టీపీ పనులు పూర్తికాలేదని పలువురు విమర్శిస్తున్నారు.

**మంత్రిగారు దృష్టి సారించాలి...**

మానవ వ్యర్థాలతో ఎరువులు తయారు చేసేందుకు చేపట్టిన పనులు నిలిచిపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులు ముందుకు సాగేందుకు సరిపడా నిధులు ఇవ్వకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైందనే భావన వ్యక్తం అవుతున్నది. ఇప్పటికైనా బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దీనిపై దృష్టి సారించి పనులు పూర్తిచేసే విధంగా చొరవ చూపాలని హుస్నాబాద్ ప్రజలు కోరుతున్నారు.

### బిల్లులు రాక పనులు చేయడం లేదు...

హుస్నాబాద్‌లో ఎఫ్ఎస్‌టీపీ పనులను మాప్రియధర్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. ఎల్లమ్మ చెరువు సమీపంలో చేపట్టిన ఈ పనులు దాదాపు 60 శాతం పూర్తి చేశారు. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని పనులు చేయడం లేదు. పనులు నిలిచిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం. కానీ వారెవరూ దానిని పట్టించుకోలేదు.

*– సాయిప్రణీత్, మున్సిపల్ ఏఈ, హుస్నాబాద్ టౌన్*



హుస్నాబాద్ టౌన్: ఎఫ్ఎస్‌టీపీలో నిర్మించిన పాలిషింగ్ ఫాండ్

# యథేచ్ఛగా కృత్రిమ ఇసుక దందా

- ప్రజాప్రతినిధుల అండతో రెచ్చిపోతున్న దళారులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- నాణ్యతలేని ఇసుకతో సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు



సంగారెడ్డి జిల్లా కంది మండలం బ్యాతోల్ శివారులో అక్రమ ఇసుక ఫిల్టర్

కంది, మే 24: మండలంలో కృత్రిమ ఇసుక దందా జోరుగా సాగుతున్నది.. నక్కవాగు ప్రాంతంలో ఉన్న బ్యాతోల్, ఆరుట్ల, ఎర్ధనూర్, చిద్రుప్పలో యథేచ్ఛగా కృత్రిమ ఇసుకను తయారు చేసి దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా అసైన్డ్ భూముల్లోని మట్టిని కడిగి నాసిరకం ఇసుకను తయారు చేస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఇసుక దళారులు రెవెన్యూ, ఇరిగేషన్, ప్రజాప్రతినిధుల అండతో వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. నక్కవాగు ప్రాంతంలో తయారు చేసిన కృత్రిమ ఇసుక దిబ్బలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. ఈ ఇసుకను గుట్టు చప్పుడు కాకుండా ట్రాక్టర్లు, లారీల్లో పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. దళారులు కృత్రిమ ఇసుకను నది ఇసుకలో కలిపి అమ్ముతూ మోసాలకు పాల్పడున్నారు.

**కాసులు కురిపిస్తున్న అక్రమదందా**

అక్రమంగా తయారు చేస్తున్న కృత్రిమ ఇసుక వ్యాపారం కాసులు కురిపిస్తుంది. కృత్రిమంగా తయారు చేసిన ఒక ట్రాక్టర్ ఇసుక రూ.5వేలు, ఒక లారీకి రూ.35 నుంచి 40 వేల వరకు స్థానిక మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌లో మేలు రకం నది ఇసుక ట్రాక్టర్‌కు రూ.10వేలు, లారీకి రూ.90 నుంచి లక్ష వరకు ధర పలుకుతుంది. కృత్రిమ ఇసుకను పట్టణ ప్రాంతాల్లోని అడ్డాల వద్దకు తరలించి నది ఇసుకలో కలిపి విక్రయిస్తున్నారు. దీంతో దళారుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది.

**ఫిల్టర్లు కూల్చినా ఫలితం శూన్యం**

గతంలో అధికారులు కృత్రిమంగా తయారు చేస్తున్న ఇసుక ఫిల్టర్లపై దాడులు నిర్వహించి ఫిల్టర్లను కూల్చివేసినా ఫలితం శూన్యమే. నాయకుల అండదండలతో రెండు రోజుల్లో మళ్లీ యథాస్థాయిలో వ్యాపారం ప్రారంభమవుతుంది. నిబంధనలకు విరుద్ధంగా తయారవుతున్న కృత్రిమ ఇసుకకు అడ్డుకట్ట వేయకపోతే చేపడుతున్న నిర్మాణాలతో ప్రమాదం తప్పదు. ఇండ్ల నిర్మాణాలకు నాణ్యతలేని కృత్రిమ ఇసుక వాడితే పగుళ్లు ఏర్పడి కూలిపోయే ప్రమాదం ఉందని నిర్మాణ రంగ నిపుణులు చెబుతున్నారు. జిల్లా, మండల అధికారులు స్పందించి కృత్రిమ ఇసుక వ్యాపారానికి అడ్డుకట్ట వేయడంతో పాటు దళారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కృత్రిమంగా తయారు చేసిన ఇసుక

### కఠిన చర్యలు తీసుకుంటాం

కృత్రిమంగా ఇసుక తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో ఇసుక ఫిల్టర్లన్నీ ధ్వంసం చేశాం. మళ్లీ ఇసుక ఫిల్టర్లు నడుస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. దాడులు నిర్వహించి బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం. ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేస్తాం. *– విజయలక్ష్మి, తహసీల్దార్, కంది*